క్లుప్తంగా

యువతతోనే దేశాభివృద్ధి


మాట్లాడుతున్న గ్రూప్ కమాండర్ రమేష్

కూడేరు: యువతతోనే దేశాభివృద్ధి సాధ్యం.. ఎన్‌సీసీ క్యాడెట్లు చిన్నతనం నుంచి దేశభక్తిని అలవర్చుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని కర్నూలు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ ఎన్.రమేష్ సూచించారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–3 ఎన్‌సీసీ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఆదివారం గ్రూప్ కమాండర్ ఎన్‌సీసీ నగర్‌ను సందర్శించారు. క్యాడెట్లు, అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత క్యాడెట్లతో సమావేశమయ్యారు. అనంతరం క్యాడెట్లకు ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను పర్యవేక్షించారు. క్యాంప్ కమాండర్ కల్నల్ బీఎస్ ప్రసాద్, ఎన్‌సీసీ అధికారులు, నంద్యాల, సత్యసాయి, కర్నూలు, అనంతపురం జిల్లాకు చెందిన 570 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ


గిరిప్రదక్షిణకు గంగా జలంతో వెళ్తున్న భక్తులు

ఉరవకొండ: ఉరవకొండలో వ్యాసపౌర్ణమి సందర్భంగా ఆదివారం గిరిప్రదక్షిణ చేశారు. గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి, బడేస్వామి భక్తులు పెద్ద ఎత్తున గిరిప్రదక్షిణ నిర్వహించారు. త్రివేణి సంగమ జలం మార్కండేయ, రామలింగ చౌడేశ్వరి, నీలకంఠేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వర, నగరేశ్వర, సుబ్రమణ్యేశ్వర, నంజుండేశ్వర, మల్లేశ్వర, వీరభద్రస్వామి, శివయ్య, గవి సిద్ధేశ్వర ఆలయాల్లో ప్రత్యేక దర్శనాల అనంతరం తిరిగి బడేస్వామి సన్నిధికి చేర్చగా, ప్రదక్షిణ ముగిసింది.

గురుకుల విద్యార్థినికి సత్కారం


జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న ఎలీసా

ఉరవకొండ: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 533 మార్కులు సాధించిన ఎలీసాను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పూలే, అంబేడ్కర్ అవార్డులతో ఆదివారం సత్కరించారు. అనంతపురంలోని జెడ్పీ హాల్‌లో పూలే, అంబేడ్కర్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టెన్త్, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 50 మంది విద్యార్థిని, విద్యార్థులకు పురస్కారాలు, నగదు అందించారు. పెద్దముష్టూరుకు చెందిన రాజేష్, అశ్వర్థమ్మ దంపతుల కుమార్తె ఎలీసాకు నగదు, ప్రశంసాపత్రం అందించారు.

పొంచి ఉంది బయోభూతం

ప్రభుత్వాస్పత్రుల వద్ద బయో వ్యర్థాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రమాదకరంగా ఉండే ఈ వ్యర్థాలను ప్రత్యేక వాహనం (బయోవాహనం) లో తరలించాల్సి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయి. ఆస్పత్రి ప్రాంగణాల్లోనే బయో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఓ ఏజెన్సీకి ఈ బాధ్యత అప్పగించామని అధికారులు చెప్తున్నా.. ఇది పూర్తి స్థాయిలో అమలు కాలేదని ఆ శాఖలోనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీ నిర్వాహకుడికి ఎంత చెప్పినా చెవికెక్కడం లేదని సిబ్బంది అంటున్నారు. జిల్లాస్థాయి ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారిస్తేగానీ పరిస్థితి గాడిలో పడే అవకాశం ఉందని ప్రజలు భావిస్తున్నారు.

- బయోవ్యర్థాల తరలింపులో నిర్లక్ష్యం
- ఆస్పత్రుల్లో అస్తవ్యస్తంగా వ్యర్థాల నిర్వహణ
- కనిపించని నాలుగు రకాల చెత్తకుండీలు
- పట్టించుకోని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు
- ఒక్కో బెడ్డుకు రూ.6.50 నుంచి రూ.7.50 చెల్లింపు


రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో బయోవ్యర్థాలు పడేశారు ఇలా..


ఆస్పత్రి ఆవరణలో పారబోసిన నీడిల్స్, సూదులు (సిరంజీలు)

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో రాయదుర్గం ఏరియా ఆస్పత్రితో పాటు కణేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ సీహెచ్‌సీలు 3, అర్బన్, మండల పీహెచ్‌సీలు 30 ఉన్నాయి. వీటికి తోడు సుమారు ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు 100కు పైగా ఉంటాయి. ఈ ఆస్పత్రుల్లో బయోవ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా తరలింపు కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాల్లో ఓ ప్రైవేట్ ఏజెన్సీ వీటిని సేకరిస్తోంది. ప్రమాదాన్ని తలపించే ఈ వ్యర్థాలను ప్రత్యేక వాహనం ద్వారా తరలించాలి. ఈ నేపథ్యంలో బయోవాహనం క్రమం తప్పకుండా ఆస్పత్రుల వద్దకు చేరుకోవాలి. గ్లౌజులు, షూ లాంటివి ధరించిన వారే వీటిని ముట్టుకోవాల్సి ఉంది. అయితే బయోవాహనం ఎక్కడా సక్రమంగా రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆస్పత్రి ప్రాంగణాల్లోనే బయో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో అయితే మరీ దారుణం. నిత్యం రోగులకు వాడిపడేసిన సూదులు, సిరంజీలు, సర్జికల్ గ్లవ్స్, సెలైన్ బాటిళ్లు, యూరిన్ బాటిళ్లు, ఇతర దూది తదితర వ్యర్థాలన్నీ పారిశుధ్య కార్మికులే బయటకు తీసుకెళ్తారు. ఆస్పత్రి వెనుకభాగంలో ఏర్పాటు చేసిన చెత్త కుండీలో పారబోస్తారు. రెండు రోజులకే కుండీ నిండిపోయి వ్యర్థాలు చెల్లాచెదురుగా పడి ఉంటాయి. వాహనం రాకపోవడంతో విధిలేక స్థానిక మున్సిపల్ వర్కర్లతో వాటిని తరలిస్తున్నారు. ట్రాక్టర్‌లో డంప్ చేసే చోట సూదులు (సిరంజీలు) తగిలినా, లేదా డంపింగ్ యార్డులో పారబోసే సమయంలో మనుషులు, జంతువులకు గుచ్చుకున్నా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

రూ.లక్షలు ఖర్చుచేసినా ఫలితేదు..

ఆస్పత్రుల్లోని బయో వ్యర్థలను తరలించేందుకు ఒక్కో పడకకు సుమారు రూ.6.50 నుంచి రూ.7.50 వరకు ఏజెన్సీకి ప్రభుత్వం చెల్లిస్తోంది. దీంతో రూ.లక్షల సొమ్ము వారి ఖాతాకు జమఅవుతోంది. కరోనా సమయంలో అయితే వాహనం కనిపించకపోయినా బిల్లులు మాత్రం జమచేశారనే అభియోగాలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల అస్పత్రుల నిర్వాహకులతో ఏజెన్సీ వాళ్లు కుమ్మక్కైనట్లు ఆరోపణలున్నాయి.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు చేపడతాం..

బయోవ్యర్థాల తరలింపులో ఏజెన్సీ నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు చేపడతామని ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ డేవిడ్, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఈబీ దేవీ హెచ్చరించారు. ఇప్పటి వరకు బయో ఏజెన్సీనికి ఎంత మేర బిల్లులు చెల్లించారు ? ఇంకా ఎంత పెండింగ్ ఉందో ? విచారిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులన్నింటిలోనూ బయో వ్యర్థాల తరలింపు సక్రమంగా జరిగేలా చర్యలు చేపడతామన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. బయో వాహనం కాకుండా ఇతరులు ఎవరు తరలించకుండా ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

కనిపించని నాలుగు డబ్బాలు..

ఆస్పత్రుల్లో బయో వ్యర్థాలు విధిగా సేకరించాలి. పసుపు, ఎరుపు, నలుపు, నీలం ఇలా నాలుగు డబ్బాల్లో వాటిని పారవేయాలి.
పసుపు రంగు: డబ్బాలో శరీర అవయవ బాగాలు, డ్రెస్సింగ్ వ్యర్థాలు, దూది, గర్బాశయం, ఆపెండిక్స్ సంబంధించిన వ్యర్థాలను ఉంచాలి. మానవ శరీర వ్యర్థాలకు సంబంధించిన వాటిని ఈ డబ్బాలో వేయాలి.
ఎరుపు రంగు: ఈ డబ్బాలో సిరంజీలు, గ్లౌవ్స్, ప్లాస్టిక్ వ్యర్థాలు, లోహ పరికరాలు వేయాలి.
నలుపు డబ్బా : ఈ డబ్బాలో ప్రమాదకర ఇతర వ్యర్థాలను వేయాలి.
నీలం డబ్బా: ఈ డబ్బాలో గాజు వ్యర్థపదార్థాలు వేయాలి.
ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ విధానం ఎక్కడా సక్రమంగా అమలుకావడం లేదు. డయాగ్నొస్టిక్ కేంద్రాలు, ప్రయోగశాలలు, బ్లడ్‌బ్యాంకు, క్లినిక్‌లు, శవపరీక్షల సమయంలో బయో వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటి నిర్వహణ కోసం ఆస్పత్రిలో పనిచేసే వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా అమలు చేయడం లేదు.

వైభవంగా బిందుసేవ


ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు గ్రామంలో భీమలింగేశ్వరస్వామి మహా రథోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో బిందుసేవ ఊరేగింపు వైభవంగా జరిగింది. గ్రామంలో పురాతన బావిలో జలం తీసుకొని భీమలింగేశ్వస్వామి ఆలయం వరకు కూడా మేళతాళాలతో పుర వీధులగుండా ఊరేగింపుగా బిందుసేవ నిర్వహించారు. అడ్డపల్లకీలో భీమలింగేశ్వస్వామి, సంజమ్మ అవ్వ మూల విరాట్లను ఊరేగించారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

రాయదుర్గం: ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని గుమ్మఘట్ట ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇసుక ట్రాక్టర్ ప్రమాదంలో ఇద్దరు చిన్నారుల మృతికి కారణమైన డ్రైవర్ వన్నూర్‌స్వామిపై 304ఏ, 113 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్.కొత్తపల్లి వద్ద గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామన్నారు. టార్పాలిన్లు కప్పుకున్నాకే ఇసుక లోడ్ తరలించాలన్నారు. లౌడ్ స్పీకర్లు ఉండే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మినీ గోకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంబదూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో మినీ గోకులాల పేరుతో పశువులు,గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఏపీఓ ఉస్మాన్ అలీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. లబ్ధిదారులను పశుసంవర్ధక శాఖ అధికారులు ఎంపిక చేస్తారన్నారు. షెడ్ల నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఉపాధి నిధుల నుంచి సబ్సిడీ చెల్లిస్తారన్నారు. పూర్తి వివరాలకు పశువైద్యశాలలో సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

షెడ్ల నిర్మాణాలకు సబ్సిడీలు ఇలా..

రెండు పశువులకు: రూ.1,01500 కాగా, రైతు వాటాగా 10 శాతం అంటే రూ.11,500 చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు పశువులకు అయితే రూ.1,85,000 అయితే సబ్సిడీ పోనూ రైతు వాటా అంటే రూ.18,500 చెల్లించాల్సి ఉంటుంది. ఆరు పశువులకు రూ.2,30,000 అయితే సబ్సిడీ పోనూ రైతు వాటా కింద రూ.23,000 చెల్లించాల్సి ఉంటుంది. 20 గొర్రెలు – మేకలకు రూ.1,30,000 కాగా, సబ్సిడీపోనూ రైతు వాటా కింద రూ.39,000 చెల్లించాల్సి ఉంటుంది. 50 మేకలు–గొర్రెలకు: రూ.2,30,000 సబ్సిడీ పోనూ రైతు వాటా కింద రూ.69,000 చెల్లించాల్సి ఉంటుంది. వంద కోళ్లకు రూ.87,000 కాగా సబ్సిడీ పోనూ రైతు వాటా కింద రూ.26,100 చెల్లించాల్సి ఉంటుంది. 200 కోళ్లకు రూ.1,32,000 కాగా, సబ్సిడీ పోనూ రైతు వాటా కింద రూ.39,600 చెల్లించాల్సి ఉంటుంది.

ఉపాధి నిధులతో షెడ్ల నిర్మాణం..

శెట్టూరు:మండలంలోని పాడిరైతులు మినీ గోకులాలు, గొర్రెలు, మేకల, కోళ్ల షెడ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశువైద్యశాఖ ఏడీ డాక్టర్ నాగలింగేశ్వ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు వలస వచ్చిన రైతులు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారు, చిన్న, సన్నకారు రైతులు ఈ షెడ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొలువుదీరిన కాడిపీర్లు



రాయదుర్గంటౌన్: పట్టణంలో చిన్నపీర్ల పండుగ (కాడి) వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు 20 ప్రాంతాల్లో పీర్లు కొలువుదీరాయి. కాడీపీర్ల ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు ఆదివారం పీర్ల చావిడిల్లో ప్రత్యేక ఫాతెహా పఠించారు. ఈ నెల 25న కాడీపీర్ల పెద్ద సరిగెత్తు, పానకాల సమర్పణ, 26న పట్టణంలోనికోట ఏరియాలో పీర్ల ఊరేగింపు, జలధి ఉంటుంది.

చిన్నంపల్లిలో జలధికి వెళ్లిన పీర్లు

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లిలో ఆదివారం పీర్లస్వాములను జలధికి తీసుకెళ్లారు. గ్రామంలో కుమమతాలకతీతంగా మొహర్రం వేడుకలు నిర్వహించారు. సాయంత్రం పీర్లను జలధికి తీసుకెళ్లి అగ్ని గుండం పూడ్చారు.

గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్లతో అవస్థలు


టార్పాలిన్ లేకుండా రాయదుర్గానికి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్

గుమ్మఘట్ట: మండలంలో కొందరు ఇసుక అక్రమంగా తరలిస్తూ, స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. భూపసముద్రం, గుమ్మఘట్ట, రంగచేడు , కణేకల్లు మండలంలో కోకుర్తి, నాగేపల్లి, మాల్యం బొమ్మనహాళ్ మండలంలో ఉద్దేహాళ్, బండూరు, కల్లుదేవనహళ్లి, బొల్లనగుడ్డం డీహిరేహాళ్ మండలంలో బాదనహాళ్, నాగలాపురం, హొసగుడ్డం, మల్లికేతి, డి.హిరేహాళ్ చెరువులు, హగరి, వాగులు, వంకల్లోని ఇసుకను అనధికారికంగా తరలిస్తూ టీడీపీ నాయకులు అక్రమార్జన చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తరలింపు..

రీచ్ వద్ద నుంచి గాని, ఇతర అక్రమ మార్గాల ద్వారా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న సమయంలో టార్పాలిన్ లేకుండా వెళ్లడంతో వెనుక వైపున వస్తున్న వాహనదారుల కళ్లల్లో పడుతోంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులుగానీ సెబ్ అధికారులు గానీ పట్టించుకోలేదు. ట్రాక్టర్లలో టేపు రికార్డర్లను పెట్టుకొని వాహనాలు నడపడం, సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ ట్రాక్టర్లు నడపడంతో తరచూ ప్రమాదం చోటుచేసుకుంటున్నాయి.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కంబదూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నిత్యానందబాబు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ప్రజలు కూడా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు విన్నవించుకోవచ్చన్నారు.

ఇష్టపడి చదివితేనే భవిష్యత్


విద్యాసామగ్రి అందిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుతారని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు అన్నారు. ఆదివారం రాగులపాడు గ్రామంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆలిండియా బంజారా సేవా సంఘం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్య, వైద్య సామగ్రి పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు బాలాజీనాయక్, మండల గౌరవ అధ్యక్షుడు నాగరాజునాయక్, ప్రధాన కార్యదర్శి పూజారి బాబునాయక్, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌నాయక్, కోశాధికారి పర మేష్‌నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేష్‌నాయక్, వజ్రకరూరు మండల అధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్, కార్యదర్శి వెంకటేష్ నాయక్, కోశాధికారి అంజినాయక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

- షిర్డీసాయి నాథుడి ఆలయానికి క్యూ కట్టిన భక్తులు
- జగదీశ్వరీ ఆలయంలో శాంతానంద రంగయ్యస్వామి పూజలు
- పూర్ణనందస్వామి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు



ఉరవకొండ, కంబదూరులో షిర్డీసాయినాథుడు


రాయదుర్గం: మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


నక్కలపల్లిలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ: ఆషాఢ శుద్ధపౌర్ణమి పర్వదినం సందర్భంగా గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక షిర్డీసాయినాథుడి ఆలయంలో సాయిబాబా మూలవిరాట్‌కు విశేష పుష్పాలతో అలంకరించారు. సాయిబాబాతో పాటు గురుదత్తాత్రేయ వారికి భక్తులు క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

జగదీశ్వరి ఆలయానికి పోటెత్తిన భక్తులు:

స్థానిక గుంతకల్లు రోడ్డు వద్ద ఉన్న ప్రసిద్ధిగాంచిన జగదీశ్వరి ఆలయంలో విశేష పూజలు, విశ్వశాంతి పతాకావిష్కరణ, అనంతరం శాంతానంద రంగయ్యస్వామి పాదాలకు పంచామృతాభిషేకం, గురుపూజ నిర్వహించారు. అనంతరం శాంతానంద రంగయ్యస్వామికి భక్తులు 300 రకాలకు పైగా వంటకాలతో నైవేద్యం సమర్పించారు.

పూర్ణానంద స్వామి ఆలయంలో విశేష పూజలు:

స్థానిక రేణుమాకుపల్లి రహదారిలో వెలసిన పూర్ణానంద స్వామి ఆలయంలో అభిషేకం, సూక్తపారాయణం కార్యక్రమాలు నిర్వహించారు. ఉరవకొండ గవిమఠంలో మఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి ఆధ్వర్యంలో మొదటి పీఠాధిపతులు కరిబసవస్వామి మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తులాభారం నిర్వహించారు.

శెట్టూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురుపౌర్ణమి భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శెట్టూరులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సాయి నాథుని ఆలయంలో ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఉదయం కాగడాహారతి, పంచామృతాభిషేకం, సాయి వ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సాయినాథుని చిత్రపటాన్ని ఊరేగించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు, అధికారులు మొక్కులు తీర్చుకున్నారు.

కణేకల్లు: కణేకల్లులోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ఆలయానికి భక్తులు పోటెత్తారు. కాగడాహారతి, దూప్‌హారతి, మ.ద్యాహ్నా హారతి, సంధ్యా హారతులిచ్చారు. అన్నదానం నిర్వహించారు.

కళ్యాణదుర్గం రూరల్: గురుపౌర్ణమి వేడుకలు కళ్యాణదుర్గం పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో, దొడగట్ట రోడ్డులోని పూర్ణానందస్వామి ఆలయంలో నిర్వహించారు. అనంతరం బాబాను ఘనంగా ఊరేగించారు.

కూడేరులో వందలాదిగా తరలివచ్చిన భక్తులు

కూడేరు: మండల కేంద్రం కూడేరులో ప్రసిద్ధిగాంచిన షిర్డీ సాయి బాబా ఆలయంలో షిర్డీ సాయి నామం మార్మోగింది. కూడేరులోని షిర్డీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో జరుపుకున్నారు.

కంబదూరు: మండల కేంద్రంలోని మల్లేశ్వరస్వామి ఆలయ రహదారిలో ఉన్న షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గురుపౌర్ణమి సందర్భంగా భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, అర్చలు,అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాలు అందించారు.

కుందుర్పి: మండల వ్యాప్తంగా ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుందుర్పి, బెస్తరపల్లి, అపిలేపల్లి, కరిగానిపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భంభం బాబా ఆలయాల్లోనూ వేడుకలు జరిగాయి.

బెళుగుప్ప: మండల పరిధిలోని బెళుగుప్ప, నక్కలపల్లి గ్రామాల్లోని షిర్డీ సాయినాథుని ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. మహా గణపతి, నందీశ్వర, దత్తాత్రేయ, సాయినాథుని పూజలు నిర్వహించారు. నక్కలపల్లిలో ఉత్సవ విగ్రహంతోనూ, బెళుగుప్పలో స్వామి చిత్రపటంతో భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు.

భంభంస్వామి ఆశ్రమంలో గురుపౌర్ణమి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భంభంస్వామి ఆశ్రమంలో భంషేక్ అబ్దుల్‌స్వాముల జీవ సమాధికి గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక ఫాతెహా పఠించారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలోని షిర్డీసాయి ఆలయంలో ఆదివారం ఓంసాయి... శ్రీ సాయి...జయజయ సాయి నామస్మరణతో మార్మోగింది. గురుపౌర్ణమి మహోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు, కాగడాహారతి, సాయినాథుడికి, పరిగణ దేవత మూర్తులకు వేదమంత్రాలతో ఫల పంచామృతాభిషేకం, నైవేద్యం, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం రథోత్సవ వేడుకలు నిర్వహించారు.


జగదీశ్వరి ఆలయంలో నైవేద్యం ఉంచిన భక్తులు


కూడేరులో పూజలు చేస్తున్న అర్చకుడు


కళ్యాణదుర్గంలో ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయినాథుడు

బొమ్మనహాళ్: మండలం వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉద్దేహాళ్, శింగానహళ్లి గ్రామాల్లో షిర్డీసాయి ఆలయాల్లో పూజలు చేశారు.శ్రీధరఘట్ట గురుదత్త ఆలయంలో వేడుకలు నిర్వహించారు.


వజ్రకరూరులో అన్నదానం చేస్తున్న దృశ్యం


రాయదుర్గంలో దత్తమూలామంత్రం చేస్తున్న దృశ్యం


బొమ్మనహాళ్‌లో పూజలందుకుంటున్న షిర్డీసాయి


రాయదుర్గంలో పూజలు అందుకున్న భంషేక్ అబ్దుల్‌స్వామి

సంక్షిప్త సమాచారం

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరులో ఆదివారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. వివరాల మేరకు.. హరిజన వన్నూరప్పకు చెందిన ఎద్దులు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో గట్టుపై మేస్తుండగా, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఎర్త్ వైరు ఎద్దు విద్యుత్ షాకుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దాదాపు రూ.లక్ష నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

ఆటో బోల్తా

కూడేరు: మండలంలోని గొటుకూరు వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం డీజిల్ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. అనంతపురానికి చెందిన గౌస్‌పీరా గుజిరీ వ్యాపారానికి కూడేరు మండలానికి వచ్చాడు. సాయంత్రం తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గౌస్ పీరా, అతని కుమారుడు జిలాన్ బాషాకు స్వల్ప గాయాలయ్యాయి.

ద్విచక్ర వాహనం అపహరణ

బొమ్మనహాళ్: మండలంలోని ఎల్‌బీనగర్‌కు చెందిన శివారెడ్డి ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఎర్రిస్వామి అనే వ్యక్తి ఇంటిముందు ద్విచక్రవాహనాన్ని నిలిపి ఉంచాడు. తెల్లవారుజామున చూసే సరికి ద్విచక్రవాహనం కనిపించలేదు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విలువల బడి చుట్టూ అపరిశుభ్రత

కుందుర్పి: మండలంలోని తూముకుంట బస్టాండ్ వద్ద ఉన్న విలువల బడి చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. స్థానిక రామాలయంలో కొన్నేళ్లుగా విలువల బడి ట్యూషన్లు నిర్వహిస్తున్నారు. అయితే విలువల బడి చుట్టూ పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. మందుబాబులు మద్యం సేవించిన గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు, కవర్లతో పాటు సిగరెట్ ముక్కలు, బీడీలు అక్కడే పడేస్తున్నారు. హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను కూడా అక్కడే పడేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి అపరిశుభ్రత తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.